సాక్షి
అనకాపల్లి
గురువారం : 26 : జూన్ : 2025

మరో లోకం



ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో బుధవారం పొగమంచు అందాలు కనువిందు చేశాయి. మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం మెలికలు తిరుగుతూ బలిమెల పరుగులు పెడుతున్న జలసోయగం ఒకవక్క.. ఇరువైపులా కొండలను తాకుతూ మరోలోకాన్ని తలపించేలా పొగమంచు మేఘాలు మరోపక్క ప్రకృతి ప్రేమికుల మనసును దోచేస్తున్నాయి. ఈ అద్భుత దృశ్యాలను చూడాలంటే సరిహద్దులోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, డుడుమ ప్రాంతాలను సందర్శించాల్సిందే. అటవీప్రాంతాలను ఇష్ట పడేవారికి ఈ అపురూప దృశ్యాలు ఎంతో సాంత్వననిస్తున్నాయి. - ముంచంగిపుట్టు (అల్లూరి జిల్లా)

న్యూస్‌రీల్

త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



నీటి సరఫరా పైప్‌లైన్ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అనకాపల్లి: అనకాపల్లి జోన్‌లో చేపట్టిన ప్రధాన నీటి సరఫరా పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మండలంలో తుమ్మపాలలో జీవీఎంసీ నీటిసరఫరా హెడ్ వాటర్ పంప్‌హౌస్‌ను, కొత్త పైప్‌లైన్ పనుల మ్యాప్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ప్రధాన పైపులైన్ పనులు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.నీటి సరఫరా సమయంలో నీటి నాణ్యతలో టర్బిడిటీ స్థాయిలను క్రమం తప్పకుండా ఉద్యోగులు పరిశీలించాలన్నారు. జీవీఎంసీ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఆరిలోవ (విశాఖ): విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆయా గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష కోసం 589 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష సమయంలో మరికొందరు విద్యార్థులు దర ఖాస్తులతో చేరుకోవడంతో.. గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి వారికి కూడా అవకాశం కల్పించారు.

ఇదేనా సంపద సృష్టి?



సంపద సృష్టిస్తానని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చెబుతుంటారు. అది ఎలా అబ్బా.. అని జనం విస్తుపోతుంటారు. కానీ ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. అధినేత మాటలను టీడీపీ **నాయకులు** అక్షరాలా నిజం చేస్తున్నారు. **సంపద ఎక్కడుందో** గమనిస్తారు. ప్రజలకు **దక్కాల్సిన ఆ సొత్తును తమ జేబులో వేసుకుంటారు.** అలా సంపద సృష్టించుకుంటారు.

హోం మంత్రి ఇలాకాలో యథేచ్ఛగా దోపిడీ

ఖనిజ సంపద టీడీపీ నేతల ఖాతాలోకి

మంత్రి గారి మాటలకు అర్థాలే వేరులే..

- తన నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వితే సహించబోనన్న హోం మంత్రి అనిత
- యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకోని వైనం
- చివరకు టీడీపీలో ఇరు వర్గాల విభేదాలతో ఖనిజ దోపిడీపై ఫిర్యాదులు
- అయినా చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్న అధికారులు



ఎస్.రాయవరం మండలం వేమగిరిలో గ్రావెల్ తవ్వకాలు

నక్కపల్లి: ప్రకృతిసిద్ధంగా లభిస్తున్న ఖనిజ సంపదను లూటీ చేస్తూ టీడీపీ నేతలు లక్షలు ఆర్జిస్తున్నారు. హోం మంత్రి ఇలాకా.. పాయకరావుపేట నియోజకవర్గంలో యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక, మట్టిని దోచుకుంటున్నారు. తన నియోజకవర్గంలో ఎవరైనా, ఎక్కడైనా అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి తవ్వితే సహించేది లేదని.. వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఒకపక్క హెచ్చరికలు చేస్తున్నా దోపిడీ దర్జాగా సాగుతోంది. ఆమె అనుచరులే ఈ ఖనిజ సంపదను ఇష్టానుసారం సొంతం చేసుకుంటున్నారు. దీన్ని బట్టి మంత్రి హెచ్చరికలకు అర్థాలు వేరులే అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. హోం మంత్రి హెచ్చరించినప్పటికీ యథేచ్ఛగా జరుగుతున్న ఖనిజ దోపిడీని అరికట్టడంలో పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం ఈ అనుమానాలకు తావిస్తోంది. మంత్రికి తెలియకుండానే టీడీపీ నాయకులు ఇంత ధైర్యం చేస్తారా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.200 కోట్ల విలువైన ఖనిజ సంపద లూటీ

ఎస్.రాయవరం మండలంలో శంకర్రావు అనే టీడీపీ సీనియర్ నేత వేమగిరిలో గ్రావెల్‌ను ఇష్టానుసారం తవ్వేసి సమీపంలో ఉన్న కంపెనీలకు, సీసీ రోడ్లు, భవనాలు నిర్మించే వారికి విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నక్కపల్లి మండలంలో చందనాడ, ఎస్.నర్సాపురం, అమలాపురం, బోయపాడు గ్రామాల్లో ఏపీఐఐసీ వారు సేకరించిన భూములు, కొండల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వేసి సంబంధిత కాంట్రాక్టర్లకు పక్కనే ఉన్న ఔషధ పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఏడాది పాలనలో సుమారు రూ.200 కోట్లు విలువైన ఖనిజ సంపదను కూటమి నాయకులు లూటీ చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఈ మండలాల్లో దోపిడీ చేసిన ఖనిజ సంపదను స్థానికంగానే కాకుండా రాంబిల్లి, యలమంచిలి పాయకరావుపేట, తుని ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఇంతదారుణంగా ఖనిజ సంపద దోపిడీ జరుగుతున్నా హోం మంత్రి ఆదేశాలు మాత్రం ఎక్కడా అమలు కావడం లేదు. బహిరంగంగానే ఆమె ఈ హెచ్చరికలు చేస్తున్నా టీడీపీ నాయకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆమె చేసిన వ్యాఖ్యలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని, సీరియస్‌గా చేశారా, లేదా ప్రచారం కోసం చేశారా అన్నది మంత్రికే తెలియాలని పలువురు అంటున్నారు. గ్రావెల్, మట్టితోపాటు, తీరప్రాంతాల్లో సముద్రపు ఇసుకను సైతం ఇదే విధంగా తరలిస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులు.. అధికారులకు తలనొప్పులు

పాయకరావుపేట మండలంలో శ్రీరాంపురం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఖనిజ దోపిడీ గురించి టీడీపీ నాయకులే అధికారులకు ఫిర్యాదు చేయడం ఇక్కడ విశేషం. ఇద్దరు మండల టీడీపీ నాయకుల మధ్య పదవుల విషయంలో వచ్చిన అసంతృప్తుల కారణంగానే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటే తప్ప పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లి వాహనాలను పట్టుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా స్పందన అంతంతమాత్రమేనంటూ పలువురు వాపోతున్నారు. తాజాగా ఆరు రోజుల క్రితం టీడీపీకి చెందిన సర్పంచ్ ఒకరు 100 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పాయకరావుపేట మండలంలో నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో పోలీసులు దాడులు నిర్వహించి రెండు ఎక్సవేటర్లు, ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇలా పట్టుకున్న వాహనాలను విడిచిపెట్టాలని టీడీపీకి చెందిన మండల స్థాయి నాయకుడొకరు పోలీసులపై ఒత్తిడి చేశారు. పట్టించేది వాళ్లే, వదిలేయాలని ఒత్తిడి చేయాలనేది టీడీపీ వాళ్లే కావడంతో ఏం చేయాలో దిక్కుతోచక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇరు వర్గాల నుంచి వస్తున్న ఒత్తిళ్లు తట్టుకోలేక మనకెందుకులే అంటూ పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న ప్రచారం జరుగుతోంది.

గద్దల్లా వాలిపోతున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో గ్రావెల్ మట్టి తవ్వకాలు విపరీతంగా పెరిగిపోయాయి. కొండలు, చెరువులు కనిపిస్తే చాలు కూటమి నాయకులు, గ్రావెల్ మాఫియా పెద్దలు గద్దల్లా వాలిపోతున్నారు. రేయింబవళ్లు ఎక్సవేటర్లు, పొక్లెయిన్‌లతో తవ్వి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. ఉచితంగా లభిస్తున్న ఈ గ్రావెల్‌ను లారీ ఒక్కంటికి రూ.5 వేలకు, ట్రాక్టర్ రూ.2 వేలకు విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గడచిన పది రోజుల నుంచి పాయకరావుపేట మండలం శ్రీరాంపురంలో పాయకరాని చెరువు, లక్ష్మీపతిరాజు చెరువులో రాత్రి పూట వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసి సమీపంలో ఉన్న ఇటుక బట్టీలకు, నిర్మాణంలో ఉన్న పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు అమ్ముకుంటున్నారు. ఎస్.నర్సాపురం, పెద్దిపాలెం, పెంటకోట, గునిపూడి, బంగారయ్యపేట సమీపంలో ఉన్న కొండల్లో ఉన్న గ్రావెల్‌ను తవ్వేసి అమ్మేస్తున్నారు.



లక్ష్మీపతిరాజు చెరువులో రాత్రి పూట మట్టి తవ్వి తరలిస్తున్న దృశ్యం



తవ్విన గ్రావెల్‌ను పునాదుల కోసం వినియోగిస్తున్న దృశ్యం







వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నేతలు: గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, సమన్వయకర్తలు పెట్ల ఉమాశంకర గణేష్, అదీప్‌రాజు, కంబాల జోగులు, మలసాల భరత్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ నేతలు సూర్యనారాయణరాజు, బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

సింగపూర్ ప్రయాణికులకు శుభవార్త



విశాఖ సిటీ: విశాఖ నుంచి సింగపూర్ విమాన ప్రయాణికులకు శుభవార్త. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి సింగపూర్‌కు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో స్కూట్ విమానయాన సంస్థ సింగపూర్ ఫ్లైట్‌ను అప్‌గ్రేడ్ చేసింది. దీంతో సీట్ల సామర్థ్యం పెరిగింది. ఇప్పటి వరకు 180 సీట్లతో ఏ320నీఈఓ విమాన సర్వీసు అందుబాటులో ఉంది. దీని స్థానంలో బుధవారం నుంచి ఏ321ఎన్ఈఓ విమానాన్ని విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి సింగపూర్‌కు నడుపుతోంది. ఇందులో 236 సీట్లు ఉన్నాయి. ఫలితంగా విశాఖ-సింగపూర్ విమాన సర్వీస్‌లో మరో 56 మంది అధికంగా ప్రయాణించే వెసులుబాటు కలుగుతోంది.

ఫార్మా గ్యాస్ లీక్ ఘటనపై విచారణ ఏదీ..?

- జాతీయ మానవహక్కుల సంఘం సీరియస్
- సుమోటోగా విచారణకు స్వీకరించిన వైనం
- ఈ నెల 11న ఎస్ఎస్ ఫార్మాలో గ్యాస్ లీకై ఇద్దరు దుర్మరణం
- మృతుల కుటుంబాలకు నష్టపరిహారం, క్షతగాత్రుల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు
- రెండు వారాల్లో నివేదిక పంపాలని సీఎస్‌కు, అనకాపల్లి ఎస్పీకి నోటీసులు



ప్రమాదం జరిగిన సాల్వెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

సాక్షి, అనకాపల్లి: ఫార్మా కంపెనీ ప్రమాదంపై స్పందించే విషయంలో జిల్లా అధికార యంత్రాంగం అలసత్వంపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ) ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశమయింది. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలో గల ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో ఈ నెల 11న గ్యాస్ లీకైన ఘటనలో ఇద్దరు ఉద్యోగులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎన్‌హెచ్ఆర్‌సీ సుమోటోగా కేసును స్వీకరించింది. రెండు వారాల్లో నివేదిక పంపాలని ఏపీ సీఎస్‌కు, అనకాపల్లి ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. మృతుల కుటుంబాలకు అందించిన నష్ట పరిహారం, క్షతగాత్రుల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ ఘటన జరిగి రెండు వారాలు అయినా జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు విచారణ కమిటీ వేయలేదంటూ ప్రశ్నించింది. ఈ ఘటనలో మానవ తప్పిదం ఉందని.. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడాలని ఆదేశించింది. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరపాలని ఆదేశించింది. అంతేకాకుండా నష్టపరిహారం, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఉన్నతాధికారులెవరూ పర్యవేక్షించలేదు..

ఫార్మా కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలో గల ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో ఇంత ప్రమాదం జరిగినా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఇద్దరూ కనీసం సందర్శించలేదని, క్షతగాత్రుడికి వైద్యం అందుతుందో లేదో కూడా పర్యవేక్షించలేదంటూ ప్రజా, కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఫార్మా కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిపై ప్రభుత్వ అధికారులు చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయని సీఐటీయూ నాయకులు మండిపడుతున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే..

ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో మూడో అంతస్తులో కామన్ ఎఫ్లియింట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో ఏర్పాటు చేసిన సాల్వెంట్ ట్యాంకు వద్ద విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ సేఫ్టీ మేనేజర్ చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ శరగడం కుమార్, హెల్పర్ బన్నాలి నాయుడులు సాల్వెంట్ ట్యాంకు లెవిల్స్‌ను పరిశీలిస్తున్న సమయంలో ట్యాంకు నుంచి భారీ ఎత్తున విష రసాయనాలు లీకయ్యాయి. ఈ ఘటనలో అక్కడే ఉన్న చంద్రశేఖర్, కుమార్‌లు విష వాయువును పీల్చడం వల్ల అక్కడికక్కడే మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న హెల్పర్ బైసాల్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు.

ఆప్షన్ల ఎంపిక వాయిదా

మురళీనగర్ (విశాఖ): పాలిటెక్నిక్ ప్రవేశాకు సంబంధించి వెబ్ ఆప్షన్ల ఎంపికను వాయిదా వేశారు. వాస్తవానికి గురువారం నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభించాల్సి ఉంది. ముందు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించి జూలై 1న ఆప్షన్ల మార్పిడి, జూలై 3న సీట్లు కేటాయింపు జరగాల్సి ఉంది. అయితే ఆప్షన్ల ఎంపికను ఈనెల 30కి వాయిదా వేశారు. ఇందుకు సంబంధించి ర్యాంకుల వారిగా కొత్త షెడ్యూలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

వైజాగ్ టు చైనా

అక్రమంగా రేషన్ బియ్యం రవాణా

- రైస్ వైన్‌లో బియ్యాన్ని వినియోగిస్తున్న చైనా
- అక్కడి డిమాండ్‌ను సొమ్ముచేసుకుంటున్న మాఫియా
- రేషన్ షాపుల ఏర్పాటుతో చెలరేగిపోతున్న ముఠా
- తాజా దాడుల్లో 473 టన్నుల బియ్యం పట్టివేత
- కీలక సూత్రధారి టీడీపీ కార్గో వ్యాపారే..!
- రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్ నివేదికలు?





స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో సివిల్ సప్లయిస్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

రాష్ట్రంలోని రేషన్ బియ్యం విశాఖ నుంచి చైనాకు ఎగుమతి అవుతోంది. చైనాలో రైస్ వైన్‌గా పిలిచే సంప్రదాయ మద్యపానీయం హువాంగ్జియు తయారీలో విరివిగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అక్కడి డిమాండ్‌కు అనుగుణంగా ఎగుమతి చేసేందుకు విశాఖలోని పలు షిప్పింగ్ కంపెనీలు రేషన్ బియ్యాన్ని మార్గంగా ఎంచుకున్నాయి. రేషన్ మాఫియా ద్వారా సేకరించి చైనాకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన 473 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విశాఖలోని పలు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్‌టీ)ల్లో ఈ నెల 23, 24 తేదీల్లో దాడులు చేసి పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందులో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ వద్ద 150 మెట్రిక్ టన్నుల బియ్యం, గేటు వే ఈస్ట్ ఇండియా సీఎఫ్‌టీలో 156 మెట్రిక్ టన్నులు, పంచవటి టోల్ గేట్ వద్ద 167 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గుర్తించినట్టు అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారమంతా ప్రధానంగా టీడీపీకి చెందిన కార్గో వ్యాపారే నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి. పట్టుకున్నవి రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్‌ల ద్వారా నివేదికలు తెప్పించుకునేందుకు వ్యవహారం నడుస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మొదటి దఫా ల్యాబ్ నివేదికల్లో రేషన్ బియ్యం కాదంటూ నివేదిక రాగా.. రెండో నివేదిక కూడా అదేవిధంగా వచ్చేలా వివిధ రకాల ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలుస్తోంది. రెండో శాంపిల్‌పై వచ్చే ల్యాబ్ నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

అంతా అమ్యామ్యాలే...!

కొన్నాళ్ల క్రితం కాకినాడ నుంచి బియ్యం ఎగుమతి చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వం నానా హంగామా చేసింది. దీంతో సాధారణ బియ్యం ఎగుమతి కూడా అక్కడి నుంచి చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో అనేక మంది విశాఖ నుంచి ఎగుమతులకు తమ మకాం మార్చారు. రేషన్ బియ్యం మాఫియా కూడా వారితో పాటు విశాఖ నుంచి చైనాకు బియ్యం ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు రచించింది. తాజాగా రేషన్ డిపోలు కూడా ఏర్పాటు కావడంతో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. ప్రధానంగా భీమిలి నియోజకవర్గంలోని రేషన్ మిల్లులతో పాటు పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లోని రేషన్ మిల్లుల కేంద్రంగా ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారు. సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్కడ సన్న బియ్యంగా మలుస్తున్నారు. వివిధ దేశాల ఎగుమతులకు సంబంధించిన అన్ని అనుమతులను కస్టమ్ హౌస్ బ్రోకరేజీ సంస్థలు తీసుకుంటున్నాయి. అనంతరం కస్టమ్స్ నుంచి అనుమతులు పొందుతున్నాయి. తరువాత రేషన్ మిల్లుల నుంచి తీసుకొచ్చి విశాఖలో ఉన్న పలు కంటైనర్ టెర్మినల్ ఫ్రైట్ స్టేషన్ల (సీఎఫ్‌టీ)లో నిల్వ ఉంచి.. కంటైనర్ల ద్వారా ఎగుమతులు చేపడుతున్నారు. టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి స్టేషన్ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేయాల్సిన అధికారులు.. కూడా ఈ రేషన్ మాఫియాతో చేతులు కలుపుతున్నారు. ఒక్క కంటైనర్ లోడ్ చేస్తే అధికారులకు రూ.50 వేల చొప్పున చెల్లింపులు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచిత్రమేమింటే గత ఏడాది డిసెంబర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు నిర్వహించిన గేట్ వే వద్ద ఈ రేషన్ బియ్యం పట్టుబడటం గమనార్హం.

ల్యాబ్ నివేదిక పేరుతో...!

పట్టుకున్న బియ్యం నమూనాలను ల్యాబ్‌కు పంపించామని.. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. మరోవైపు మొదటి దాడుల్లో పట్టుకున్న 150 మెట్రిక్ టన్నుల బియ్యంలో పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా.. రేషన్ బియ్యం కాదని నివేదిక వచ్చినట్టు సమాచారం. ఇక మిగిలిన బియ్యం నమూనాల నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని అంటున్నారు. ఈ నివేదికలు కూడా రేషన్ బియ్యం కాదని వస్తాయా? అవునని వస్తాయా అనేది చూడాల్సి ఉంది. దాడుల్లో పట్టుకున్న బియ్యం అనుమానిత ప్రజా పంపిణీ బియ్యం అని స్పష్టంగా ప్రకటనల్లో పేర్కొన్న అధికారులు.. ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా రవాణా, నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొనడం విశేషం.

చైనా డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకే...!

వాస్తవానికి చైనాలో సంప్రదాయ రైస్ వైన్‌కు డిమాండ్ ఉంది. చైనీస్ రైస్ వైన్ అని కూడా పిలువబడే హువాంగ్జియును ప్రధానంగా చైనాలోని జియాంగ్నాన్ ప్రాంతంలో ఉడికించిన బియ్యాన్ని పులియబెట్టడం ద్వారా తయారుచేస్తారు. దీనికి ఉండే ప్రత్యేకమైన రుచితో పాటు తక్కువ ఆల్కహాల్ (8 నుంచి 20) శాతం, మంచి పోషక విలువలు ఉండటంతో చైనీయులు ఎంతో ఇష్టంగా సేవిస్తారు. ఇందులో అమైనో ఆమ్లాలు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఉంటాయి. దీనికి 5 వేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగి ఉంది. ఈ నేపథ్యంలో చైనాలో ఉండే ఈ రైస్ వైన్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ దేశాల నుంచి బియ్యాన్ని ఆ దేశం దిగుమతి చేసుకుంటుంది. అక్కడి డిమాండ్ ఇక్కడి రేషన్ బియ్యం మాఫియాకు కలిసివస్తోంది. ఇక్కడి నుంచి భారీగా రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేయడంలో టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన గార్గ్

తుమ్మపాల: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్ బుధవారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ విజయ కృష్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జీవీఎంసీలో అంతర్భాగమైన అనకాపల్లి పట్టణంలో జీవీఎంసీకి సంబంధించిన అభివృద్ధి కార్యకలాపాలు, జీవీఎంసీ పరిధిలో గల పరిపాలన పరమైన అంశాలపై చర్చించారు.

ఐఐఎస్ఈఆర్‌లో సాయి అనీష్‌కు 434వ ర్యాంకు



ప్రతిభ కనబరిచిన సాయి అనీష్

పాయకరావుపేట: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) బుధవారం ప్రకటించిన ఫలితాలలో శ్రీప్రకాష్ విద్యార్థి జి.సాయిఅనీష్ జాతీయ స్థాయిలో 434వ ర్యాంకు సాధించాడు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐఐటీ, జేఈఈతో పాటుగా అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తుండడంతో ఇటువంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్. భానుమూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన సాయిఅనీష్‌ను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

అదానీ పవర్ ప్రాజెక్టులకు అనుమతులు రద్దు చేయాలి

అనకాపల్లి: అదానీ కంపెనీ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో నిర్మించనున్న రెండు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల సామర్థ్యానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల మధ్యలో ఉన్న రెండు పవర్ ప్రాజెక్టులకు అదనంగా సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఇచ్చిన అనుమలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట వద్ద వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1800 మెగావాట్లకు పెంచాలని, అనకాపల్లి జిల్లా రైవాడ జలాశయ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 600 నుంచి 900 మెగావాట్లకు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కేబినేట్‌లో ఆమోదించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనకాపల్లి, విశాఖ ప్రజలకు రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడుతుందని అయన ఆందోళన వ్యక్తం చేశారు.

గప్‌చుప్‌గా ప్రజాభిప్రాయ సేకరణ

- అనుమతులు లేకపోయినా దర్జాగా కొండ తవ్వకాలు
- ఇప్పటికే మూడు కిలోమీటర్ల మేర అక్రమంగా రోడ్డు నిర్మాణం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని తహసీల్దార్



రావు గోపాలరావు కాలనీ రామాలయంలో నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ



కొండను తవ్వి అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు

అనకాపల్లి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఓ కొండ తవ్వకాలతో పాటు రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదుల మేరకు అధికారులు గుట్టుచప్పుడుగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీస సమాచారం లేకుండా తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించి నివేదిక తయారు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని బవులవాడ పంచాయతీ రావు గోపాలరావు కాలనీలో సర్వే నంబర్లు 70, 74, 75లలో ప్రభుత్వం ఆధీనంలో ఉన్న కొండను తవ్వి సమీపంలో ఉన్న క్వారీలకు లారీలు వెళ్లేందుకు వీలుగా దర్జాగా రోడ్డును నిర్మించారు. దీంతో కొంత మంది గ్రామస్తులు ఈ విషయంపై కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేశారు. అయినా మూడు కిలోమీటర్ల మేర అక్రమంగా రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించారు. పలు ఫిర్యాదుల మేరకు ఎట్టకేలకు కొద్ది రోజుల క్రితం రోడ్డు పనులను తహసీల్దార్ రూరల్ ఎస్ఐల సహాయంతో ఆపించారు. అప్పటి నుంచి ఎలాగైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని భావించిన మైనింగ్ మాఫియా విశ్వ ప్రయత్నాలు చేసింది. అందుకు అధికారుల సహకారం తీసుకున్నారు. దీంతో ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండా గప్‌చుప్‌గా తహసీల్దార్ విజయ్‌కుమార్, మైన్స్ ఏజీ కె.పురుషోత్తమ నాయుడు, రూరల్ ఎస్ఐ రవికుమార్, తదితర అధికారులతో కాలనీలోని రామాలయంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. వాస్తవానికి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలంటే గ్రామంలో దండోరా వేయాలి. పత్రికా ప్రకటనలు ఇవ్వాలి. బహిరంగ ప్రదేశంలోనే సమావేశం నిర్వహించాలి. కానీ ఇవేమీ పాటించకుండానే తూతూ మంత్రంగా కానిచ్చేశారు. ఈ సమావేశంలో పలువురు ఈ రోడ్డు నిర్మాణం వల్ల బండరాళ్ళు తమ ఇళ్లపై పడిపోతాయని, జరగరానిది ఏమైనా జరిగితే ఏవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. మరికొంత మంది గ్రామంలో అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. అయితే ప్రలోభాలకు గురైన కొంత మంది అమాయకులు ఈ రోడ్డు ఏర్పాటుతో తమకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ క్రమంలో ఒకానొక దశలో గ్రామస్తుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

ఉపాధి ఎర చూపి..

రావు గోపాలరావు కాలనీలో ప్రజలంతా రెక్కాడితే గానీ డొక్కాడని వారు. అత్యధికులు దినసరి కార్మికులు, పేదలు. చిన్నపాటి ప్రలోభాలకు లొంగిపోతారని తెలుసుకున్న మైన్స్ మాఫియా బాబులు కొంత మందికి రూ.1500 చొప్పున పంపిణీ చేసి, ప్రజాభిప్రాయ సేకరణలో తమకు అనుకూలంగా మాట్లాడేలా చేసుకున్నారు. గ్రామ స్థాయి నాయకులకు అడిగినంత ముట్టజెప్పినట్లు సమాచారం. ఇలా ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేయడానికి మీకే అధికారాలు ఉన్నాయని కొంత మంది ప్రశ్నిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ విజయకుమార్‌ను సంప్రదించగా.. కాలనీలో 25 మంది అభిప్రాయాలు సేకరించామన్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు. కొండపై అనధికారికంగా రోడ్డు కోసం తవ్వితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసులను కోరినట్టు వివరించారు.

‘నషా ముక్త్ భారత్’లో భాగస్వాములు కండి



జిల్లా, మండల అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం వంటి దురాచారాలకు బానిసలు కాకుండా వారిలో చైతన్యం కలిగించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ కార్యక్రమంపై ఆమె ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా అధికారులతో కలిసి ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమన్ని ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించేలా రూపొందించాలన్నారు. ర్యాలీలో యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ, వార్డు సచివాలయల సిబ్బంది మరియు ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. నేటి తరానికి, రేపటి భవిష్యత్ పౌరులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజం అందించాలంటే, ఈ విధమైన చైతన్య ర్యాలీలు కీలకమన్నారు. జిల్లా ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలసి ర్యాలీలో పాల్గొని ‘నషా ముక్త భారత్ అభియాన్’ లక్ష్యాన్ని సాకారం చేయడంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వి.వి.రమణ, డీఎస్పీలు, సీఐలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులను తక్షణమే రద్దు చేయాలి

- మారిక, చింతలపూడి మధ్య హైడ్రో ప్రాజెక్టు నిర్మిస్తే ‘రైవాడ’కు ముప్పు
- ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లి: అనంతగిరి మండలం పెదకోట, దేవరాపల్లి మండలంలోని చింతలపూడి, మారిక గ్రామాల మధ్య హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేబినెట్ ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అల్లూరి జిల్లా పెదకోట ఏరియాలో 1800 మెగావాట్స్, దేవరాపల్లి మండలం చింతలపూడి, వేపాడ మండలం మారిక గ్రామాల మధ్య 900 మెగా వాట్స్ సామర్థ్యంతో లూప్ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీలను, ఇతర పేద ప్రజలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడం అత్యంత దారుణమని చెప్పారు. చింతలపూడి, మారిక గ్రామాలను ఖాళీ చేసేందుకు అదాని ప్రతినిధులు పూనుకోవడం అన్యాయమన్నారు. వేపాడ మండలం మారిక, దేవరాపల్లి మండలం చింతలపూడిలో శారదానదిపై ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడంతో రైవాడ జలాశయం ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. విశాఖ ప్రజల తాగునీటి అవసరాలకు సైతం తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. 1/70 చట్టాన్ని, ఐదవ షెడ్యూల్ వర్తించే రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోకుంటే రైవాడ ఆయకట్టు భూములు బీడులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మారిక, చింతలపూడి గ్రామాలను ఖాళీ చేయించే పనులను అదాని గ్రూపు సంస్థల ప్రతినిధులు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే మారిక గ్రామ ప్రజలు సామాజిక ఆర్థిక సర్వేను అడ్డుకున్నారని, వీరి స్ఫూర్తితో రైవాడ ఆయకట్టు రైతులు పోరాటానికి సిద్ధం కావాలన్నారు.

హిందూ మతవ్యాప్తికి ఐక్యంగా పనిచేయాలి

వీహెచ్‌పీ, భజరంగదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్



కె.జె.పురం సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

మాడుగుల రూరల్: గ్రామాల్లో అన్యమత వ్యాప్తి వల్ల హిందూమతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని వీహెచ్‌పీ భజరంగదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రావాడ రాజశేఖర్ పేర్కొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజు రాత్రి వీహెచ్‌పీ గ్రామ కమిటీ సభ్యులు గ్రామాల్లో సామూహిక హారతి ఇవ్వాలని సూచించారు. మండల కమిటీలు ప్రతి నెలలో సత్సంగాలు ఏర్పాటు చేయాలన్నారు. హిందూ యువకులు మాదక ద్రవ్యాలకు, మద్యానికి బానిస కాకుండా సత్ప్రవర్తన, సద్భావనతో మెలగాలని కోరారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, సమరతాసేవా ఫౌండేషన్ వంటి సంస్థలు హిందూ మత ఉద్ధరణకు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు మాట్లాడుతూ మండలంలో 56 గ్రామ కమిటీలు ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో మండల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు కరణం దేముళ్లు, మండల సత్సంగ్ ప్రముఖ్ పాచిల అప్పారావు, మండల లీగల్ సెల్ కన్వీనర్ పేర్ని శంకర్, దుర్గావాహిని ప్రముఖ్ కరణం వెంకటలక్ష్మి, మండల వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు అప్పాన ప్రసాదు, కోశాధికారి పరిమి కాసుల జగ్గారావు, పీలా శ్రీనివాసరావు, ఆళ్ల వెంకట గంగాధర్ జగన్నాథరావు, జామి చిన్న , పలువురు వీహెచ్‌పీ గ్రామ కమిటీ సభ్యులు, సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిరంజీవి

మునగపాక: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడని ఆశ పడిన ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం జోగారావుపేటకు చెందిన ప్రగడ రాజు,లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు చిరంజీవి(27) తన అమ్మమ్మ గ్రామమైన నారాయుడుపాలెంలో చిన్నప్పటి నుంచి ఉంటున్నాడు. చిరంజీవి స్థానికంగా సీలింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన స్నేహితుడు కేశెట్టి ధర్మరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై నారాయుడుపాలెం నుంచి అనకాపల్లి వైపునకు వెళ్తుండగా తోటా-మూలపేట ఆర్చి సమీపంలో అనకాపల్లి నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనక కూర్చొన్న చిరంజీవి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిరంజీవి మృతి చెందాడు. బైక్ నడుపుతున్న ధర్మరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందరితో సరదాగా ఉండే చిరంజీవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అటు జోగారావుపేట ఇటు నారాయుడుపాలెం గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

రెండు బైకులు ఢీకొని.. ముగ్గురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది



ప్రమాదంలో నుజ్జు అయిన ద్విచక్ర వాహనాలు

దేవరాపల్లి: దేవరాపల్లి–ఆనందపురం ఆర్అండ్‌బీ రోడ్డులో కాశీపురం–సంజీవమెట్ట గ్రామాల మధ్య బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఒక మహిళతో పాటు ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మరో యువకుడు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. మహిళ పరిస్థితి విషయంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తికి చెందిన సుగుణ అనే మహిళ తన కుమార్తె హాఫ్ శారీ ఫంక్షన్‌కు బంధువులను ఆహ్వానించడం కోసం ద్విచక్ర వాహనంపై వచ్చి దేవరాపల్లి నుంచి ఇంటికి వెళ్తున్నారు. దేవరాపల్లికి చెందిన వసంతకుమార్, నారాయణరావుతో పాటు మరో యువకుడు ద్విచక్ర వాహనంపై ఆనందపురం నుంచి వస్తున్నారు. సంజీవమెట్ట సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు బలంగా ఢీకొట్టాయి. ఈప్రమాదంలో సుగుణ తలపై బలమైన గాయంతో పాటు రెండు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. మిగతా ఇద్దరు యువకులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స చేశారు. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించినట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి సురేంద్ర బాబు తెలిపారు. సంఘటన స్థలాన్ని దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పరిశీలించి, ప్రమాదం జరిగిన ప్రాంతం వేపాడ మండల పరిధిలోకి వస్తుందని ఆయన విలేకరులకు తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడు కార్తీక్‌ను అరెస్ట్ చేసి, విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

కశింకోట: మండలంలోని కొత్త అచ్చెర్ల గ్రామంలో చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడ్ని అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ ఎం.శ్రావణి విలేకరులకు బుధవారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. కొత్త అచ్చెర్ల గ్రామంలో ఈ నెల 16న తన ఇంటి వద్ద నిమ్మదల ధనలక్ష్మి గడ్డి కోస్తోంది. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన శీలం కార్తీక్(24) బైక్‌తో ఆమె వద్దకు వచ్చి ఆగాడు. రాజాం గ్రామానికి దారెటు అని మాటలు కలిపాడు. బైకును ఆన్‌లోనే ఉంచాడు. ధనలక్ష్మి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును గుర్తించాడు. వెంటనే వాటిని తెంచుకుని పరారయ్యాడు. ఈ విషయాన్ని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో ఎస్ఐలు కె.లక్ష్మణరావు, పి.మనోజ్ కుమార్, కానిస్టేబుళ్లు డి.మహేష్, గోపీ, శ్రీనివాస్, మూర్తిలతో కూడిన బృందం నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీలు, నిఘా సమాచారంతో ఎట్టకేలకు నిందితుడ్ని గుర్తించారు. దొంగిలించిన బంగారు పుస్తలతాడును విక్రయించేందుకు బయ్యవరం వద్ద విశాఖకు వెళుతుండగా పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రైవేటు ఉద్యోగం మానేసి బెట్టింగ్ వ్యసనంతో అప్పుల్లో కూరుకుపోయిన నేపథ్యంలో నగదు కోసం చోరీలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని డీఎస్పీ శ్రావణి తెలిపారు. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులను గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇంటర్‌నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో శ్రావ్యశ్రీకి ప్రథమ బహుమతి



ట్రోఫీ అందుకుంటున్న శ్రావ్యశ్రీ

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం గ్రామానికి చెందిన భీమరశెట్టి శ్రావ్యశ్రీ ఆరియన్‌ప్రో ఇంటర్‌నేషనల్ బాలికల జూనియర్ చెస్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి సాధించింది. ముంబై వేదికగా ఈ నెల 16 నుంచి 24 వరకు జరిగిన చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఈ బాలిక గతంలో అనేక చదరంగం పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. ఆమె అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్‌గా నిలవడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

1247 మద్యం బాటిళ్ల స్వాధీనం




ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట: మండలంలోని కేశవరం పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 1247 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కేశవరం గ్రామం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. తాడిపర్తి, తునికి చెందిన నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది డి.నాగేశ్వరరావు, ఆర్.జగన్నాథం, కె.నాగప్రసాద్, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కోతలు.. సాంకేతిక తిప్పలు

‘తల్లికి వందనం’లో సిత్రాలివీ..





బొత్స రాము, అతని భార్య లక్ష్మి ఆధార్ నంబర్లకు చిత్తూరి పరిధిలో బిల్లులు అనుసంధానమైన దృశ్యం

తరగపువలస: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న తీరుకు పొంతన లేకుండా పోయింది. ‘తల్లికి వందనం’పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15,000 చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు నిబంధనల పేరుతో లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. మాట నిలబెట్టుకోకపోగా.. సాంకేతిక లోపాల పేరుతో అర్హులకు సైతం అన్యాయం చేస్తూ తల్లుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

‘ఎవ్వరికీ ఎగ్గొట్టం’అన్నారు.. ఇప్పుడేమో.?

‘మీ ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తాం. ఒకరుంటే రూ.15 వేలు.. ఇద్దరుంటే రూ.30 వేలు, నలుగురుంటే రూ.60 వేలు ఇస్తాం’అని ఎన్నికల ప్రచారంలో నారా చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ‘నిబంధనల సాకుతో ఎవరికీ ఎగ్గొట్టం’అంటూ నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ మాటలు నమ్మిన తల్లులకు ఇప్పుడు ఎదురవుతున్నవి కోతలు, కష్టాలే.

తొలి ఏడాది గుండు సున్నా.!

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం మాట మార్చింది. తొలి ఏడాది పథకాన్ని అమలు చేయకుండా ఎగ్గొట్టేసింది. ఎట్టకేలకు ఈ ఏడాది తల్లికి వందనం అమలు చేయగా.. అనేక నిబంధనలు విధించి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. హామీ ఇచ్చిన పూర్తి మొత్తం అందకపోవడం, సాంకేతిక సమస్యలతో అర్హుల జాబితా నుంచి పేర్లు గల్లంతవ్వడం వంటి ఘటనలతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఈ సిత్రాలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

కోతలతో జమ

జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేటలో తెలుగు రామలక్ష్మి, మద్దిల చిట్టితల్లి, అడివరపు పుష్పలత అనే మహిళల ఖాతాలకు రూ.13 వేలకు బదులుగా రూ.10,900 వంతున జమ అయ్యాయి. ఒక్కొక్కరికి రూ.2,100 కోత విధించడంపై బాధితులు ప్రశ్నిస్తే.. ‘ఎంత పడితే అంతే’అంటూ సచివాలయ సిబ్బంది, బ్యాంకర్లు సమాధానమిస్తున్నారు. ఇచ్చిన హామీకి, జమ అవుతున్న మొత్తానికి పొంతన లేకపోవడంపై తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ అనుసంధానంతో అనర్థత

సంతపేటకు చెందిన బోని ఈశ్వర్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రేష్ఠ 2వ తరగతి, సాత్విక 5వ తరగతి చదువుతున్నారు. ఆయన ఆధార్ నంబర్‌కు అదనంగా వేర్వేరు ఇంటి పేర్లు కలిగిన అయిదుగురు ఈశ్వర్ పేర్లు లింక్ అయ్యాయి.. దీంతో ఆయన విద్యుత్ వాడకం నెలకు 150 యూనిట్లు దాటకపోయినా, రికార్డుల్లో 900 యూనిట్లుగా చూపిస్తోంది. ఈ సాంకేతిక తప్పిదం కారణంగా ఆయన పిల్లలకు పథకం అందలేదు. వారం రోజులుగా ఈయన విద్యుత్ కార్యాలయం, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా డీలింక్ కావడం లేదు. అలాగే, ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన బొత్స రాము, అతని భార్య లక్ష్మి ఆధార్ నంబర్లకు ఏపీఈపీడీసీఎల్‌కు బదులు చిత్తూరు జిల్లా పరిధిలోని ఏపీఎస్‌పీడీసీఎల్‌కు సంబంధించిన బిల్లులు అనుసంధానం అయిపోయాయి. దీంతో విద్యుత్ బిల్లు రూ.2 వేలు దాటిందని చూపి, ఇంటర్ చదువుతున్న కుమారుడికి పథకం వర్తించలేదు. దీంతో బాధితులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఒకవైపు సాంకేతిక లోపాలను సరిదిద్దడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతుంటే.. మరోవైపు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నిలబెట్టుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నాటి మాటలకు, నేటి చేతలకు పొంతన లేదని, ‘తల్లికి వందనం’పథకం తల్లులకు ఆనందం బదులు ఆవేదననే మిగులుస్తోందని బాధితులు వాపోతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా బంద్ రేపు

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం 11 కేవీ ఆర్టీసీ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, గాంధీ కూరగాయలు మార్కెట్, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రంగాచారి

అనకాపల్లి టౌన్: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి పి.బి. రంగాచారి తెలిపారు. మండలంలో పాపయ్యపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ యాజమాని పద్ధతులు పాటించాలని సూచించారు. పిల్లి పెసర, జనుము, జీలుగ వంటి పచ్చి రొట్ట పంటలు వేయాలన్నారు. ఎకరా భూమి, బోరు బావి ఉన్న రైతులకు ఏపీ మైక్రో ఇరిగేషన్ శాఖ 50 శాతం సబ్సిడీపై పైపులు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లంబ విజయ ప్రసాద్, సర్పంచ్ ఎ.నానాజీ, మాజీ సర్పంచ్ దాడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



భవిత, యశోధరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు

అనకాపల్లి: మండలంలోని మామిడిపాలెం హైస్కూల్‌లో టెన్త్ చదివిన ఇద్దరువిద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీట్లు సాధించిన పీలా భవిత(నూజివీడు ట్రిపుల్ ఐటీ), దండుపాటి యశోధర(శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ)లకు హెచ్ఎం బి.శ్రీధర్ పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ఇష్టపడి చదవడం వల్ల లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయ్, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, వంసతరావు, కరుణజ్యోతి, దయాసాగర్, ఆచార్యులు, లక్ష్మీరమణి, జగదీశ్వరి, సుజాత, ఈశ్వరబాబు, నాగమణి, సుబ్బలక్ష్మి, శ్రీదేవి, ఎర్రయ్య పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 26 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,970	4,970
రెండో రకం	3,700	3,700
మూడోరకం	3,600	3,650

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
డ్రాగన్	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	: సత్యనారాయణ స్క్రీన్-2
కుబేరా	:పర్తిసాయి
సితారే జమీన్ పర్	:షిర్డీసాయి
పాప	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
హంటర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 13 యూనిట్లు, బి పాజిటివ్ -14 యూనిట్లు, ఒ పాజిటివ్ –14 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య. లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 289 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 193 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్‌నంబర్ 08924–223595)ని సంప్రదించవచ్చు.

ఫౌండేషన్ స్కూళ్ల పైనే... ఆసక్తి

- ప్రైమరీ హైస్కూళ్లపై నిరాసక్తత
- ఇప్పటి వరకు ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి మాత్రమే చేరిక
- తరగతులు ఎక్కువ కావడంతో పట్టించుకోరని అనుమానం
- ఫౌండేషన్ స్కూళ్లలో 20 మంది జాయిన్



తాళ్లపాలెం బేసిక్ ప్రైమరీ హైస్కూలు పక్కనే ఉన్న ఫౌండేషన్ స్కూలు

కశింకోట: మండలంలో బేసిక్ ప్రైమరీ హైస్కూళ్లలో 1,2 తరగతుల్లో చేరడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం తెరచి రెండు వారాలు కావస్తున్నప్పటికి ఇప్పటి కేవలం ఒక విద్యార్థి మాత్రమే ఒక స్కూలులో చేరాడు. మరో నాలుగు స్కూళ్లలో ఒక్కరూ చేరలేదు. పక్కనే ఉన్న ఫౌండేషన్ స్కూళ్లలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటిలో మాత్రం ఇప్పటి వరకు 20 మంది వరకు ఒకటో తరగతిలో చేరారు. ఈ ఏడాది నూతన విద్యా విధానంలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో పది హైస్కూళ్లలో సగం హైస్కూళ్ల స్థానంలో బేసిక్ ప్రైమరీ హైస్కూళ్లను ఒకటో తరగతి నుంచి 10 వరకు ఏర్పాటు చేశారు. వాటిలో ఒక స్కూలు తప్ప మిగిలిన స్కూళ్ల పక్కనే 1,2 తరగతులను బోధించే ఫౌండేషన్ స్కూళ్లు ఉన్నాయి. ఇవి పక్క పక్కనే ఉండటంతో ఫౌండేషన్ స్కూళ్లలో తమ పిల్లలను చేర్చడానికే విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. బయ్యవరం, వెదురుపర్తి,కొత్తపల్లి, తాళ్లపాలెం,కన్నూరుపాలెం హై స్కూళ్లను బేసిక్ ప్రైమరీ కం హైస్కూళ్లగా మార్పు చేశారు.వీటిలో కేవలం కన్నూరుపాలెం హైస్కూలులో ఒకటో తరగతిలో ధర్మ సహస్రఅనే విద్యార్థి ఒక్కరు మాత్రమే చేరాడు. మిగిలిన హైస్కూళ్లలో ఒక్కరు కూడా చేరలేదు. ఈ స్కూళ్ల పక్కనే ఫౌండేషన్ స్కూళ్లు ఉండడమే కారణం. తాళ్లపాలెం హైస్కూలు పక్కన ఉన్న ఫౌండేషన్ స్కూలులో ఆరుగురు, కొత్తపల్లి హైస్కూలుకు ఆనుకొని ఉన్న ఫౌండేషన్ స్కూలులో ముగ్గురు, బయ్యవరం హైస్కూలు పక్కన ఉన్న స్కూలులో ముగ్గురు, వెదురుపర్తి హైస్కూలు పక్కనే ఉన్న స్కూలులో ఐదుగురు విద్యార్థులు ఈ ఏడాది 1వ తరగతిలో చేరారు. అయితే పక్కనే బేసిక్ ప్రైమరీ కం హైస్కూళ్లు ఒకటి నుంచి తరగతులు ఏర్పాటు చేసినా చేరకపోవడం విశేషం. కన్నూరుపాలెం హైస్కూలులో మాత్రం ఒక విద్యార్థి చేరాడు. అయితే అదే స్కూలులో సోదరి ప్రవల్లిక 7వ తరగతి చదువుతుండడంతో ఆమె తోడుగా ఉంటుందని తమ్ముడు ధర్మ సహస్రను అక్కడ చేర్చారు. లేదంటే ఆ విద్యార్థి కూడా చేరే అవకాశం లేకపోయేది. ఆ విద్యార్థికి ఒక ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రత్యేక తరగతి కేటాయించి విద్యను అందిస్తున్నామని హెచ్ఎం రమణశ్రీ తెలిపారు. ఇక్కడ మాత్రం హైస్కూలుకు అటు కన్నూరుపాలెం, ఇటు శివారు పాత కన్నూరుపాలెం గ్రామాల ఫౌండేషన్ స్కూళ్లు దాదాపు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. వీటిలో కన్నూరుపాలెం ఫౌండేషన్ స్కూలులో మాత్రం ముగ్గురు విద్యార్థులు 1వ తరగతిలో చేరారు. పాత కన్నూరుపాలెంలో ఫౌండేషన్ స్కూలులో ఇప్పటికి ఇంకా విద్యార్థులు చేరలేదు. పక్కపక్కనే బేసిక్ ప్రైమరీ హైస్కూల్, ఫౌండేషన్ స్కూల్ ఉన్నా ఫౌండేషన్ స్కూల్‌లో పిల్లలను ఎందుకు చేర్చారని తల్లిదండ్రులను ప్రశ్నించగా హైస్కూల్‌లో విద్యార్థులు ఎక్కువ మంది ఉంటారని, అందువల్ల తమ పిల్లలను సరిగా పట్టించుకునే అవకాశం ఉండదని చెప్పారు. అందుకే ఫౌండేషన్ స్కూల్‌లో చేర్పినట్టు తెలిపారు.



తాళ్లపాలెం ఫౌండేషన్ స్కూలులో చేరిన 1వ తరగతి విద్యార్థులు



తాళ్లపాలెం బేసిక్ ప్రైమరీ హైస్కూలు

నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఏర్పాటు

నూతన విద్యా విధానానికి అనుగుణంగా మండలంలో 5 చోట్ల 1 నుంచి 10వ తరగతి వరకు బేసిక్ ప్రైమరీ హైస్కూళ్లను ఏర్పాటు చేశారు. గతంలో మూడు నుంచి పదవ తరగతి వరకు వీటిలో బోధన ఉండేది. అలాగే గతంలో ఉండే ప్రాథమిక పాఠశాలల స్థానంలో 13 ఫౌండేషన్ స్కూళ్లను 1,2 తరగతులతో నెలకొల్పారు. వీటిలో నాలుగు చోట్ల ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ హైస్కూళ్ల పక్కనే ఉన్నాయి. విద్యార్థులు తమకు అనుగుణమైన స్కూలులో 1,2 తరగతుల్లో చేరేడానికి అవకాశం ఉంది.
-కె.ఎస్.ఎన్. మూర్తి, ఎంఈవో, కశింకోట.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

తుమ్మపాల: ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు జూలై నెల రేషన్ వారి నివాసాల వద్ద పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. జిల్లాలో ప్రతి చౌకధరల దుకాణాన్ని ఆయా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో అనుసంధానించి ముందుగానే తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లాలో అన్ని డిపోలకు జూలై నెల కోటా రేషన్ నిల్వలు పంపిణీ పూర్తయిందన్నారు. పై కేటగిరీలోకి వచ్చే రైస్ కార్డుదారులు తమ ఇళ్లలోనే ఉండి, రేషన్ వస్తువులు పొందవచ్చని, చౌకధరల దుకాణాలకు వచ్చే అవసరం లేదన్నారు.

సకాలంలో వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి టౌన్: వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆశాజ్యోతి పాల్గొన్నారు.

82,83 వార్డుల సమస్యలు పరిష్కరించాలి



కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు కార్పొరేటర్ల వినతి

అనకాపల్లి: అనకాపల్లి జోన్ 82, 83 వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను ఆయా వార్డుల కార్పొరేటర్లు కోరారు. బుధవారం వారు కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. 82వ వార్డు పరిధిలో శారదానది ఒడ్డున గల హిందూ శ్మశాన వాటికలో రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు దంపతులు కమిషనర్‌ను కోరారు. మృతదేహాలను దహనం చేసేందుకు గ్యాస్ యంత్రాన్ని ఏర్పాటు చేసి, కొత్తగా భవనం నిర్మాణపనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దాడి దుర్గాలమ్మ వీధి, ఉమ్మలాడ రహదారి, పాత బర్మాకాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రహదారిలో డ్రైనేజీ, సీసీ రహదారి పనులకు నిధులు కేటాయించాలన్నారు.

83వ వార్డు పరిధిలో మిర్యాలకాలనీలో 4వ వీధి రహదారి, అన్నపూర్ణ బ్యాంకువీధి డ్రైనేజీ, ఉడ్‌పేట, చదువులవారివీధి, వేల్పులవీధి శివాలయం రహదారి, మళ్లవరపువారివీధి రహదారి పనులకు నిధులు మంజూరు చేయాలని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ దంపతులు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం అగ్రిమర్రి చెట్టు జగన్నాథస్వామి ఆలయంలో గురువారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. ఈనెల 27 నుంచి జులై 6వ తేదీ వరకూ జగన్నాథస్వామి రథయాత్ర వేడుకలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 27న జగన్నాథస్వామి రథోత్సం ఉదయం 10గంటలకు ప్రారంభమై గూడ్స్‌రోడ్డులో ఇంద్రద్యుమ్నహాలు వరకూ సాగుతుందన్నారు. అక్కడ తొమ్మిది రోజుల పాటు జగన్నాథస్వామి వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అనంతరం జగన్నాథస్వామి తొలి రథోత్సవ పోస్టర్‌ను నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామకృష్ణ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు. బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వి.వి. సుబ్రహ్మణ్యం,బొడ్డేడ వెంకట చలపతిరావు, కోటమ నాయకుడు పాల్గొన్నారు.



జగన్నాథస్వామి రథోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

అల్పపీడన ప్రభావంతో వర్షాలు



మునగపాక మెయిన్ రోడ్డులో నిలిచిన నీరు



మునగపాక మండల సముదాయానికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపునీరు

కోటవురట్ల: మండలంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా చిన్నపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధపడుతున్నారు. పలు ప్రాంతాలలో ఖరీఫ్ సాగుకు నారుపోస్తున్నారు. జల్లూరు, బి.కె. పల్లి, యండపల్లి, కోటవురట్ల, రాజుపేట, కైలాసపట్నం, రామచంద్రపురం తదితర ప్రాంతాలలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలతో గ్రామీణ రహదారులు చిత్తడిగా మారిపోయాయి. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి అడపాదడపా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. మునగపాక మెయిన్ రోడ్డు, మండల సముదాయానికి వెళ్లే మార్గంలో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం పంటల సాగుకు ఎంతగానో దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

ఎడతెరిపి లేకుండా..

ఎస్.రాయవరం: మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. జనాలు రాకపోవడంతో గ్రామ సచివాలయాలు, మండల కేంద్రంలోని పలు కార్యాలయాలు బోసిపోయాయి. వ్యవసాయ కూలీలు పనులు లేక ఇళ్ల వద్దనే ఉండిపోయారు.



ఎస్.రాయవరం మండలంలో కురుస్తున్న వర్షం



కోటవురట్లలో ..

అవగాహనతోనే క్షయ అంతం



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వాణి జగదీశ్వరీ

అనకాపల్లి టౌన్: అవగాహనతో క్షయ వ్యాధిని అంతం చేయవచ్చని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణి జగదీశ్వరీ తెలిపారు. మండలంలోని గోపాలపురంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు తరచూ ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు వాడాలన్నారు. దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం లాంటివి క్షయ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత



బీమా చెక్కులు అందజేస్తున్న ఏపీజీవీబీ శాఖ మేనేజర్ కవిత

కశింకోట: మండలంలోని కొత్తపల్లి, బుచ్చెయ్యపేట గ్రామాల్లో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు పీఎంజేజేబీవై బీమా చెక్కులను బుధవారం పంపిణీ చేశారు.ఆర్థిక అక్షరాస్యతపై కొత్తపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షలు అందించారు. ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ కవిత మాట్లాడుతూ బ్యాంకులో అమలు చేస్తున్న బీమా పథకాలు, ఇతర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి. అశోక్‌కుమార్, కౌన్సిలర్లు ఆర్.వాణి, ఎ.గిరీష్, సీహెచ్. మహేష్ పాల్గొన్నారు.

డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: పాడి రైతులు విశాఖ డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం పాల సంఘ వేతన కార్యదర్శి బొడ్డేడ కృష్ణ కోరారు. బుధవారం సంఘ నూతన డైరెక్టర్లుగా పెంటకోట అచ్చియ్యమ్మ, ఆడారి ముసిలి అప్పారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ సేవలందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల సంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, శరగడం యోగి నాగేశ్వరరావు, కొయిలాడ ఎర్రయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థినులకు వసతి గృహం ఏర్పాటు చేయాలి



రామానందంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్రకుమార్

అనకాపల్లి: ఇంటర్మీడియెట్ నుంచి పీజీవరకు చదువుతున్న ఎస్సీ విద్యార్థినులకు జిల్లా కేంద్రం అనకాపల్లిలో వసతి గృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ కోరారు. బీసీ వసతి గృహంలో వసతి పొందుతున్న ఎస్సీ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈమేరకు స్థానిక జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామానందంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహాల భవనాల శ్లాబ్‌లను పడగొట్టి తాత్కాలికంగా రేకుల షెడ్ వేసి ముస్తాబు చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం అనకాపల్లి జిల్లాలో మాత్రమే ఈ విధంగా రేకుల షెడ్డులో విద్యార్థులను ఉంచుతున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలో వసతి లేక గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఇంటిదారి పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో ప్రభావతి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు



కశింకోట డీపీఎన్ హైస్కూలులో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

అనకాపల్లి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఎక్కడైన బాలకార్మికులను గుర్తించినట్టయితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని సీడీపీవో పి.ప్రభావతి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యదుర్వినియోగం, బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి బుధవారం విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. బాలలను రక్షించి వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలని ఆమె సూచించారు. బాలకార్మిక వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు నిర్మల, వంశీప్రియ, సుచరిత, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కశింకోట: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ కె. లక్ష్మణరావు తెలిపారు.

స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని, వాటికి జోలికి వెళ్లరాదన్నారు. మాదక ద్రవ్యాలతో పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేయరాదని తెలిపారు. 18 ఏళ్లు నిండిన తర్వాత బాలికలకు వివాహం చేయాలన్నారు. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.జి.సంతోషి, డి.శ్యామల,బి.మహేశ్వరి, బి.కమలకుమారిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైస్కూలు ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.వి.జె. ప్రసాదరావు, బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నేమాల రమణ, ఉపాధ్యాయులు బి.ఆనంద్, బి.అప్పారావు,కాండ్రేగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి



కె.జె.పురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వెంకటరావు

మాడుగుల రూరల్ : వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లోను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వి.వెంకటరావు తెలిపారు.

కె.జె.పురం కాలనీలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బి.నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరావు జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పండగ వాతావరణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ఎ.రవికుమార్, సంపూర్ణ, ఎలకా మాలిబాబు, ఎం.ఎం.దాసు, కండిపల్లి వెంకటరావు, మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక: ప్రతి మహిళ తన జీవనోపాధిని మెరుగుపరుచుకొని అదనంగా నెలకు రూ.10వేల మేర సంపాదన ఉండేలా చూసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి కోరారు. మునగపాక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతం కావాలన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం అవసరమని చెప్పారు. ఆవుల పెంపకంపై దృష్టి సారించి ఆదాయం పెంచుకునే మార్గాలను ఎంచుకోవాలన్నారు. మైక్రో సంస్థల నుంచి రుణాలు తీసుకొని మోసపోరాదన్నారు. పురుషులతో సమానంగా మహిళలు బాగా చదువుకొని ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎల్‌సీ శ్రీనివాస్,సీసీలు వేణు,రామకృష్ణ,శ్రీను, నిర్మల, నాగమణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.